క్లుప్తంగా

ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రామస్వామి



రామస్వామికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జనరల్ సెక్రటరీ అరవ పాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్స్ జీవోస్ అండ్ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ అరవ పాల్ బుధవారం వట్టిపల్లి రామస్వామికి నియామక పత్రాన్ని అందజేశారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవ పాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వనాథ్ సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: దర్శకుడు విశ్వనాథ్ సినీ రంగ సేవలు వెలకట్టలేనివని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం దర్శకుడు విశ్వనాథ్, గాయని వాణీ జయరాం సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాలకు దర్శకత్వం వహించారన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ హోదా తీసుకొచ్చిన మధుర గాయని వాణీ జయరాం అని అభివర్ణించారు. పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి విశ్వనాథ్ సినీ రంగ సేవలను వివరించారు. తొలుత అతిథులు విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు.వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు బాలాజీకుమార్, బీవీ వరభద్రరావు పాల్గొన్నారు. దొరుకునా ఇటువంటి సేవ పేరుతో నగరానికి చెందిన గాయనీ గాయకులు విష్ణుప్రియ, కొప్పరపు ఉమాబలరాం, వడ్డాది కామేశ్వరి విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాలలోని గీతాలను ఆలపించారు.

చురుగ్గా యూజీడీ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్ సమీపంలో యూజీడీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడ స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే యూజీడీ పైపులైన్ పనులు పూర్తికాగా పంపింగ్ స్టేషన్ పూర్తయితే డివిజన్ వాసులకు యూజీడీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవల ఇక్కడ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు యూజీడీ పనులు వేగవంతం చేయాలని, రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. దీంతో ఇక్కడ యూజీడీ పనులు వేగవంతం అయ్యాయి.

సేవాగుణం అలవర్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తోటివారికి సేవ చేయడం అలవాటుగా చేసుకోవాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ సూచించారు. దుర్గాపురానికి చెందిన ఫణి, వల్లి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జన్మదినం , వివాహ దినోత్సవం వంటి శుభకార్యాలకు అనవసరపు ఖర్చుచేయకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం మాతృ దేవో భవ ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు వడ్డించారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి పర్యవేక్షించారు.

గృహ ప్రవేశాలకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు నిర్దేశించిన 16వేల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల ప్రగతిపై బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, స్పెషలాఫీసర్లు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి సుమారు 16 వేలకు పైగా ఇళ్లకు లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 7,821కు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశలలో ఉందని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి నిర్దేశిత సమయానికి గృహప్రవేశాలు చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులతో తక్షణమే ముఖాముఖి మాట్లాడి నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.

లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉగాది నాటికి లక్ష్యాలు పూర్తి కావాలన్నారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఈ రవికాంత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, జిల్లాకు చెందిన మండల స్పెషలాఫీసర్లు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



సమస్యలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు వారి గడప వద్దకే వచ్చి చేరతాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కృష్ణలంక, 21వ డివిజన్, 106 వార్డు సచివాలయం పరిధిలోని పచ్చమేడ బజార్, నల్లూరివారి వీధులలో స్థానిక కార్పొరేటర్ పుప్పాల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బ్రోచర్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోల్చితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యాదీవెన, రైతుభరోసా వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు పాలన చేరువ చేయడం జరిగిందన్నారు. ఒక వైపు సంక్షేమం పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరుగుతుంటే చూసి ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యే నగరంలో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రచారం చేస్తున్నారన్నారు. ఒకసారి గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన హత్యలు, కాల్‌మనీ, సెక్స్ రాకెట్ ఘటనలు గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈ ఘటనలన్నింటిలో టీడీపీ నాయకులు సూత్రధారులుగా ఉన్నారని, జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వాటన్నింటినీ అణచివేశారని తెలిపారు. అందుకే ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, శివాలయం చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు టి.పి.రెడ్డి, గోగు గౌరీ, పుప్పాల రాజా, మద్దెల పవన్, సుంకర పెద్దబ్బాయి, రమేష్ పాల్గొన్నారు.

సహజ ఉత్పత్తులతోనే ఆరోగ్యం



అమర్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మనం నిత్యం సహజ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని నేషనల్ సెంటర్ ఫర్ న్యాచురల్ ప్రొడక్ట్స్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ మిస్సిసిపీ (యూఎస్ఏ)లోని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అమర్ జీ. చిట్టిబోయిన చెప్పారు. సిద్ధార్థ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల సెమినార్ హాల్లో న్యాచురల్ ప్రొడక్ట్స్-కెమిస్ట్రీ అనే అంశంపై సదస్సు జరిగింది. అమర్ అతిథిగా హాజరై మాట్లాడారు. సహజ ఉత్పత్తులను ఉపయోగించడంతో మనుషులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయుర్వేద శాస్త్రంలో సహజ ఉత్పత్తుల ప్రాముఖ్యతను తెలియజేశారు. చామంతి పూలలో ఉన్న ఔషధగుణాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాచురల్ ప్రొడక్ట్స్‌లో ఉన్న ఔషధ పదార్థాలు వాటిని ఎలా వేరే చేస్తారనే అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ బాబూరావు, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.మనోరంజని, అధ్యాపకులు ఎం.డేవిడ్ రాజు, టి.సత్యదేవ్, పీటీఎస్ఆర్‌కే.ప్రసాదరావు, విశాలక్ష్మమ్మ, నాగార్జున బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి ప్రైవేట్ వాహనాల గండి



ఆటోనగర్ బస్‌స్టాండ్ వద్ద నిలిపి ఉన్న ప్రైవేట్ వాహనాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు):ఆర్టీసీ ఆదాయానికి ప్రైవేట్ వాహనాలు గండి కొడుతున్నాయి. విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు ప్రైవేట్ వాహనాలు పదుల సంఖ్యలో వెళుతుంటాయి. మినీ ఆటోట్యాక్సీలతో పాటు ఆటోలు ఇక్కడ నుంచి వెళ్తుంటాయి. ఇదిలా ఉండగా ఆటోనగర్ టెర్మినల్ బస్‌స్టేషన్ ముందు ప్రైవేట్ వాహనాలను పెట్టి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. బహిరంగంగా ఇంత జరుగుతున్నప్పటికీ మాత్రం ఇక్కడి ఆర్టీసీ సిబ్బందికాని, సంబంధిత అధికారులుగానీ పట్టీపట్టనట్టుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. ఈ బస్‌స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఇటుగా మచిలీపట్నం, గుడివాడ, భీమవరం, రాజోలు పెడన తదితర ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు వెళుతున్నాయి. సుమారు వందకు పైగా బస్ సర్వీస్‌లు వెళుతుంటాయి. ఇక్కడ స్టేషన్ ముందు ప్రైవేట్ వాహనాలను ఆపి మరీ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీనివల్ల ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కృష్ణలంక రైతుబజార్‌కు శుక్రవారం సెలవు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక పోలీస్ స్టేషన్ సమీపంలోని కృష్ణలంక రైతుబజార్‌కు ప్రతి శుక్రవారం వారాంతపు సెలవు రోజుగా నిర్ణయించినట్లు రైతుబజార్ ఎస్టేట్ అధికారి జాన్ విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈ వారం నుంచి రైతుబజార్‌కు ప్రతి శుక్రవారం సెలవు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సీఎన్జీ ఆటోల అనుమతికి దరఖాస్తు చేసుకోండి

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ నగరంలో పెండింగ్‌లో ఉన్న 529 డీజిల్ ఆటోలకు సీఎన్జీ ఆటోలుగా మార్చుకునేందుకు వాటి యజమానులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 నాటికి నగరంలో రిజిస్ట్రేషన్ అయిన 8,600 డిజిల్ ఆటోలను నియంత్రిస్తూ అప్పటి ప్రభుత్వం 155 జీఓను జారీ చేసిందని గుర్తు చేశారు. నియంత్రించిన ఆటోల స్థానంలో సీఎన్జీ ఆటోలకు వెంటనే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. దీంతో నగరంలోని 8,071 ఆటోలు సీఎన్జీ ఆటోలుగా మారినట్లు పేర్కొన్నారు. ఇంకా సీఎన్జీ ఆటోలకు అనుమతి తీసుకోవాల్సిన 529 మంది వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 529 ఆటోల జాబితాను బందరు రోడ్డులోని కార్యాలయం వద్ద నోటీసు బోర్డులో పొందుపరచినట్లు పేర్కొన్నారు.

ప్రయోగాల్లోనూ నైపుణ్యాలను సాధించాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతోపాటు ప్రయోగాల్లోనూ నైపుణ్యాన్ని సాధించాలని గుంటూరు పెరల్స్ ల్యాబ్‌కు చెందిన డాక్టర్ ఎస్.గురవయ్య పేర్కొన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాల లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల పెంపకంపై నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్, వర్క్‌షాప్ నిర్వాహకురాలు జపమలై, కళాశాల కరస్పాండెంట్ స్లీవా తుమ్మ, కె.జయచంద్, అనూహ్య పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని గులామొహుద్దీన్‌నగర్ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే ఆయేషా సూచించారు. స్థానిక చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన, వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎప్పుడు వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలో వివరించారు. అలాగే కాన్పులు కచ్చితంగా ఆస్పత్రిలోనే చేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాధినిరోధక టీకాలు వేశారు.

కె.విజయ పోరాటాలు ఆదర్శనీయం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ నాయకురాలు కె.విజయ చేసిన పోరాటాలు అందరికి ఆదర్శనీయమని ఆ పార్టీ నాయకులు కె.రామరాజు పేర్కొన్నారు. మహిళా సమాఖ్య నాయకురాలు విజయ వర్ధంతి కార్యక్రమం వాంబేకాలనీలోని స్కూల్ సెంటర్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో జరిగిన అనేక పోరాటాల్లో విజయ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని, ప్రధానంగా కంచ్రిక భూపోరాటాల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. తొలుత విజయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు మెడికల్ కిట్లు, దుస్తులు పంపిణీ చేశారు. రైల్వే ప్రసాద్, పాపారావు పాల్గొన్నారు.

విజయవాడలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్

ప్రారంభించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వైద్యశాఖ మంత్రి విడదల రజిని, పక్కన ఆస్పత్రి చైర్మన్ అమర్ అగర్వాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు):నేత్రవైద్యంలో అగ్రగామిగా ఉన్న డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ విజయవాడలోనూ అందుబాటులోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మహాత్మాగాంధీరోడ్డు రాఘవయ్యపార్కు ఎదురుగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రవైద్యంలో డాక్టర్ అగర్వాల్స్ హాస్పిటల్‌కు ఒక ప్రాముఖ్యత ఉందన్నారు. అలాంటి హాస్పిటల్ విజయవాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రిల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు ప్రైవేటు రంగంలో కూడా నాణ్యమైన సేవలు అందించడం స్వాగతించే విషయమన్నారు. డాక్టర్ అగర్వాల్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో రూ.500 కోట్లు వెచ్చించి 30 ఆస్పత్రులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రస్తుతం ఇండియాతో పాటు, ఆఫ్రికా ఇతర దేశాల్లో 137 ఆస్పత్రులున్నాయని పేర్కొన్నారు. 2023 చివరి నాటికి 200ల ఆస్పత్రులకు విస్తరించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఆరోగ్య రంగంలో వేగవంతమైన పురోగతి సాధిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగం కావాలని తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో క్లినికల్ సర్వీసెస్ రీజనల్ హెడ్ డాక్టర్ కంద్రుకల్యాణ శ్రీనివాస చక్ర వర్తి, డాక్టర్ రమ్య, డాక్టర్ మేఘన పాల్గొన్నారు.

నైపుణ్యాలున్న వారికి ఉపాధి అవకాశాలు

సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నైపుణ్యాలు ఉన్న వారికి ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, అందువల్ల యువత నైపుణ్యాల పెంచుకోవడంపై దృష్టి సారించాలని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ) సీనియర్ ప్రొఫెసర్ సీ రాఘవేంద్రరావు చెప్పారు. సిద్ధార్థ కళాశాల వెబ్‌నార్ హాలులో పీజీ (ఎమ్మెస్సీ), ఎంసీఏ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రస్తుత ప్రపంచంలో సమస్యలు-గణితం ద్వారా పరిష్కార మార్గాలు అనే అంశంపై బుధవారం సదస్సు జరిగింది. రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు రావడం లేదని, నిరుద్యోగం క్రమంగా పెరుగుతోందని అనడంలో వాస్తవం లేదన్నారు. యువత చదువుతో పాటుగా నైపుణ్యాలు పెంచుకోవాలని, అప్పుడే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. నైపుణ్యాలు లేకుంటే ఏ కంపెనీ ఉద్యోగాలు ఇవ్వవనే విషయాన్ని యువత గుర్తించుకోవాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటన్నింటికీ సాంకేతికత పరిష్కార మార్గాలు చూపలేవని రాఘవేంద్రరావు చెప్పారు. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలను గణిత శాస్త్రం ఉపయోగించి వాటిని ఎలా పరిష్కరించుకోవాలో ఆయన తెలియజేశారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల మాట్లాడుతూ విద్యార్థులు అంశాలను ఇష్టపడి చదవడం ద్వారా దానిపై పట్టు సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ సమాజంలో ఎదుర్కొంటున్న పలు సమస్య పరిష్కారానికి పరిశోధనలు ఎక్కువగా జరగాలన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సభ అనంతరం విద్యార్థుల సందేహాలను రాఘవేంద్రరావు నివృత్తి చేశారు.

లక్ష్యాల సాధనకు నిర్దిష్ట ప్రణాళిక అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శారదాదేవి

విజయవాడ స్పోర్ట్స్: ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్న యువతే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తుందని యువజన సర్వీసుల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదాదేవి అన్నారు. 9,10 తరగతుల విద్యార్థులు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కేరీర్ గైడెన్స్‌పై పటమటలోని యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. జీవితంలో అధిగమించాల్సిన లక్ష్యాలను ముందుస్తుగానే నిర్ణయించుకోవాలన్నారు. ఆ లక్ష్యాలను చేరుకునేందుకు పాఠశాల స్థాయి నుంచే పునాదులు వేసుకోవాలన్నారు. లక్ష్యాలు చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు మానసికంగా ధైర్యంగా ఉండాలని సూచించారు. యువతకు కేరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులను త్వరలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. అనంతరం మానసిక వైద్యులు డాక్టర్ జగదీష్, తేజావతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీ రామకృష్ణ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల యువజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువత అన్ని అంశాల్లో పట్టుసాధించాలి



యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న శారదదేవి

పటమట(విజయవాడతూర్పు): యువత అన్ని అంశాలపై పట్టు సాధించాలని యువజన సర్వీసుల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శారద దేవి అన్నారు. స్టెప్-క్రిషి విజయవాడ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్ అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పటమటలోని కెనరా బ్యాంకు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ యువత కమ్యూనికేషన్‌తో పాటు వ్యక్తిత్వాన్ని, జీవితంలో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. తమ శాఖ ద్వారా యువత అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్టులు జగదీష్, తేజావతి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ డెప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీడీఎస్ రామకృష్ణ, జిల్లా యువజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, పీవీ రాఘవశర్మ, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో తరగతులను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ ప్రకటనలో తెలిపారు. పేషంట్ రిలేషన్స్ సర్వీసెస్ డ్యూటీ మేనేజర్, సేల్స్ సూపర్‌వైజర్, విజువల్ మర్చండైజర్ ఉద్యోగాలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ విద్యార్హతతో 35 సంవత్సరాల లోపు వయసున్న వారు ఈ ట్రైనింగ్‌కు అర్హులని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ తరగతుల జరుగుతాయని, శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈ నెల 20 తేదీలోగా 92901 11349లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన ఫ్రీ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వారు ఎవరైనా ఈ ట్రైనింగ్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు.



పత్రాలు కాదు.. వలస పక్షులు

నగరంలో స్టేట్ గెస్ట్‌హౌస్ సమీపంలో ఓ చెట్టుపై వలస పక్షులు (రోజీ స్టార్లింగ్స్) అధిక సంఖ్యలో వాలి పత్రాలు లాగా కనిపిస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి స్వరాజ్య మైదానం, అతిథి గృహం తదితర ప్రాంతాల్లో పక్షులు విహరిస్తూ ఉంటాయి. పక్షుల ప్రేమికులు అక్కడకు వచ్చి వాటిని చూసి ఆనందంగా గడుపుతున్నారు.

–సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ

